నొప్పి డాక్టరు యాత్రలు




హ్యూ లాఫ్టింగ్

నొప్పి డాక్టరు యాత్రలు




హ్యు లాఫ్టింగ్

అనగనగా ఒక డాక్టరు. అతడి పేరు జాస్ డూలిటిల్. కాని అందరూ అతడిని నొప్పి డాక్టరు అంటారు.




ఎం.డి. అంటే అతడికి ఎన్నో విషయాలు తెలుసని అర్థం.

నొప్పి డాక్టరు ఇంగ్లాండులోని
పోతారులంక అనే ఒక చిన్న
ఊరులో ఉండేవాడు.



పొడవైన టోపీ పెట్టుకుని బజారులో
నడుస్తూ ఉంటే ఊళ్లోని కుక్కలు, పిల్లులు,
ఆవులు, గుర్రాలు, పందులు, కోళ్లు, గొర్రెలు,
కప్పలు, తాబేళ్లు అతడి వెనకే వెళ్లేవి.



మనుషులకు చికిత్స చేసే బదులు నొప్పి డాక్టరు జంతువులకు చికిత్స చేసేవాడు. అతడికి జంతువులంటే ఎంతో ప్రేమ. జంతువులకు కూడా అతనంటే ఎంతో ఇష్టం. నొప్పి డాక్టరుకి చూపించుకోటానికి ఎంతో దూరం నుంచి కూడా జంతువులు వచ్చేవి.

అలా వచ్చిన కొన్ని జంతువులు అతడి దగ్గరే ఉండిపోయేవి. కొంత కాలానికి నొప్పి డాక్టరు ఇల్లు అనేక రకాల జంతువులతో నిండిపోయింది.



చివరికి అతడు ఉండటానికి కూడా కొంచెమే చోటు మిగిలింది.

నొప్పి డాక్టరు తనకు ఇష్టమైన కొన్ని
జంతువులకు పేర్లు కూడా పెట్టాడు:

బాతు పేరు డబ్-డబ్.



కుక్క పేరు జిప్.




పంది పేరు గబ్-గబ్.

గుడ్లగుబ పేరు టూ-టూ.





ఇంకా బహుభాషాకోవిద
అనే చిలక ఉంది.



అయితే నొప్పి డాక్టరు ఇంటిలో
ఉండే అనేక ఎలకలు,
బాతులు, కోళ్లు, కుందేళ్లు,
తాబేలు, ముళ్లపంది, మొసలి
వంటి వాటికి పేర్లు పెట్టటం
సాధ్యం కాలేదు.





ఒక రోజు బహుభాషా కోవిద చిలక నొప్పి
డాక్టరుతో, "ఇప్పుడు నీ దగ్గర చాలా
పెంపుడు జంతువులు ఉన్నాయి. కాబట్టి,
నువ్వు వాటితో మాట్లాడటం నేర్చుకోవాలి.
నేను నీకు అన్ని జంతువుల భాషలు
నేర్పుతాను," అని అంది.

నొప్పి డాక్టరు నల్లబల్ల ముందు
కూర్చున్నాడు. అతడికి జంతువులు
పాఠాలు నేర్పసాగాయి. కొంత కాలానికే
నొప్పి డాక్టరు జంతువులతో మాట్లాడటం
నేర్చుకున్నాడు. ఇప్పుడు జంతువుల
మాటలన్నీ నొప్పి డాక్టరుకి
అర్థమవుతున్నాయి.






నొప్పి డాక్టరు జంతువుల భాషలు
నేర్చుకున్న తరవాత ఒక రాత్రి పూట
అతడి ఇంటి తలుపు తెరుచుకుంది.
పరిగెత్తుతూ ఒక కోతి వచ్చింది.
“డాక్టర్! నా పేరు చీ-చీ,” అంది ఆ కోతి.

“కోతుల గురించి చెప్పటానికి నేను ఆఫ్రికా
నుంచి వచ్చాను. అక్కడి కోతులకు ఒక
వింత రోగం సోకింది. మీరు ఆఫ్రికా వచ్చి
వాటికి చికిత్స చెయ్యాలని
కోరుకుంటున్నాం. మా విన్నపాన్ని
మన్నిస్తారా?”



“నీతోపాటు తప్పకుండా వస్తాను,” నొప్పి డాక్టరు అన్నాడు. మరునాడు నొప్పి డాక్టరు తోపాటు జిప్, డబ్-డబ్, గబ్-గబ్, టూ-టూ, బహుభాషాకోవిద ప్రయాణానికి తమ సామానులు సర్దుకుని ఓడరేవుకి వెళ్లారు.



నొప్పి డాక్టరు ఒక ఓడను కిరాయికి తీసుకుని తన సామానంతటితో అందులోకి ఎక్కాడు.

ఆరు వారాలపాటు
వాళ్లు ఓడలో ప్రయాణం
చేశారు.



భూమధ్య రేఖను దాటిన తరువాత
వాళ్లకి ఎగిరే చేపలు కొన్ని కనిపించాయి.

“ఆఫ్రికా ఇక్కడికి 50 మైళ్ల దూరమే,”
అని ఎగిరే చేపలు చెప్పాయి.



అంతలో అకస్మాత్తుగా తుఫాను
వచ్చింది. మెరుపులు మెరిశాయి,
పెద్దపెట్టున ఉరుములు ఉరిమాయి.
జోరున వాన కురిసింది.

ఉన్నట్టుండి పెద్ద శబ్దం అయ్యింది.
ఓడ ఆగిపోయింది. ఓడ ఒక పక్కకి
ఒరిగిపోయింది. "మిత్రులారా, ఆఫ్రికా
చేరుకోటానికి ఇక మనం వేరే మార్గాలు
చూసుకోవాలి," డాక్టరు చెప్పాడు.

"తాడు తీసుకుని రండి,"
బహుభాషాకోవిదుడు అరిచాడు.
"డబ్-డబ్, నువ్వు తాడుని ఒక
వైపున పట్టుకో. ఎగిరి సముద్రం
ఒడ్డుకి వెళ్లు. తాడుని కొబ్బరి చెట్టుకి
కట్టు.

"ఈత రాని జంతువులు తాడు
పట్టుకుని ఒడ్డుకి చేరాలి."
ఆ రకంగా అన్ని జంతువులు
క్షేమంగా తీరాన్ని చేరుకున్నాయి.



అక్కడ ఎత్తైన ప్రదేశంలో వాళ్లు ఒక
గుహలో తలదాచుకున్నారు.



ఉన్నట్టుండి చీ-చీ, “మాట్లాడకండి! నాకు ఏవో
అడుగుల చప్పుడు వినబడుతోంది,” అంది.

తల బయటకు పెట్టి చూసిన వాళ్లకి
అడవిలోంచి వస్తున్న ఒక సైనికుడు
కనిపించాడు. అతడి ముఖానికి కవచం
ఉంది, ఒక చేతిలో ఢాలు, మరొక చేతిలో
బల్లెం ఉన్నాయి.



"మీరందరూ జాల్లింగికి రాజు ముందు
హాజరు కావాలి," అతడు అన్నాడు.
"ఈ ప్రాంతమంతా ఆ రాజుదే. నా వెనకే
రండి!"

ఆ సైనికుడి వెంట అడవిలో కొంత దూరం
వెళ్లిన తరవాత వాళ్లకి ఆ రాజు కోట
కనపడింది. రాజు ఒక గొడుగు కింద
కూర్చుని ఉన్నాడు. “నా రాజ్యం గుండా
ప్రయాణించే హక్కు మీకు లేదు,”
రాజు వాళ్లతో అన్నాడు.
తరవాత సైనికులవైపుకి తిరిగి,
“ఈ మందుల మనిషిని, అతడి
జంతువులను అన్నిటికంటే పటిష్టమైన
జైలులో పెట్టండి!”






ఆ జైలుకి ఒకేఒక కిటికీ ఉంది. అది చాలా ఎత్తులో ఉంది, దానికి చువ్వలు ఉన్నాయి. జైలు తలుపు చాలా లావుగా, గట్టిగా ఉంది, గోడలు కూడా పెద్ద, పెద్ద రాళ్లతో బలంగా ఉన్నాయి. అదంతా చూసి గబ్-గబ్ ఏడవటం మొదలుపెట్టింది. నొప్పి డాక్టరు కూడా ఆందోళన పడసాగాడు.





"కిటికీ చువ్వల మధ్య నుంచి నేను దూరిపోగలను. ఈ రాత్రి బయటకు ఎగిరి కోటకు వెళతాను. ఇక్కడినుంచి తప్పించుకోటానికి ఏదైనా మార్గం వెదుకుతాను," మాటల చిలక అంది.

ఆ రాత్రికి చిలక ఎగిరి కోటలోకి వెళ్లింది. అది మెల్లగా రాజు గదిలోకి వెళ్లి అతడి మంచం కింద దాక్కుంది. "నేను నొప్పి డాక్టరుని," అచ్చంగా అతడి గొంతులో పలికింది చిలక. "అదృశ్య రూపంలో ఉన్నాను కాబట్టి నన్ను చూడలేవు. నా మాటలు జాగ్రత్తగా విను. నిన్ను హెచ్చరిస్తున్నాను!



"నన్ను, నా జంతువులను నీ ప్రాంతం గుండా వెళ్లనివ్వు. లేకపోతే ఆ కోతుల లాగానే నీకు కూడా రోగం వచ్చేలా చేస్తాను. వెంటనే నీ సైనికులను పంపించి జైలు తలుపులు తెరిపించు, లేకపోతే తెల్లారే సరికి నీకు ఆటలమ్మ సోకుతుంది." అది విన్న రాజు ఒణికిపోయాడు. మంచం మీదనుంచి ఒక్క గెంతు గెంతాడు.





జైలు తలుపులు తెరవమని తన
సైనికులకు చెప్పాడు రాజు. డాక్టరు,
జంతువులు జైలు నుంచి బయటకు
వచ్చారు.
అప్పుడు వాళ్లందరూ పరిగెత్తుతూ
అడవిని దాటి, కోతులు ఉండే చోటుకి
చేరుకున్నారు.






చిలక తనని మోసం చేసిందని
తెలుసుకున్న రాజు అగ్గిమీద గుగ్గిలం
అయ్యాడు. నిద్రపోయేటప్పుడు
వేసుకునే బట్టలతోనే అతడు
పరుగుతీశాడు. తన సైన్యాన్ని అంతటిని
లేపి అడవిలో నొప్పి డాక్టరుని
పట్టుకోమని పంపించాడు.



అడవిలోని దారులు సైనికులకంటే
కోతి చీ-చీకి బాగా తెలుసు. అది
అడవిలో బాగా దట్టమైన ప్రాంతం
లోకి జంతువులను అన్నింటిని
తీసుకెళ్లింది.

అక్కడ పెద్ద చెట్టు తొర్రలో
జంతువులను దాచిపెట్టింది.
“సైనికులకు కనపడకుండా ఇక్కడ
దాక్కుందాం. వాళ్లు వెదికి, వెదికి
వెళ్లిపోయిన తరవాత మనం
బయటకు రావచ్చు.”




సైనికులందరూ తిరిగి వెళ్లిపోయిన తరవాత చీ-చీ, నొప్పి డాక్టరు, మిగిలిన జంతువులన్నీ బయటకు వచ్చాయి. అందరూ కలిసి కోతుల రాజ్యంవైపు వెళ్లసాగారు.





ఆ సాయంత్రం వాళ్లకి చాలా కోతులు కనిపించాయి. అవన్నీ చెట్ల మీద కూర్చుని నొప్పి డాక్టరు కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాయి. ఎంతో పేరుగాంచిన నొప్పి డాక్టరుని చూసేసరికి అవన్నీ గోల చెయ్యసాగాయి. సంతోషంతో అరవసాగాయి. అతడికి స్వాగతం పలుకుతూ చేతులు ఊపాయి, ఒక కొమ్మ మీద నుంచి మరొక కొమ్మ మీదకి దూకసాగాయి.



అయితే సైనికులు రాజు దగ్గరకి తిరిగి వెళ్లలేదు. నొప్పి డాక్టరు కోసం ఇంకా వెతుకుతూనే ఉన్నారు. మళ్లీ కనిపించేసరికి అతడిని పట్టుకోటానికి పరిగెత్తసాగారు. తమ శక్తినంతటిని ఉపయోగించి జంతువులు, నొప్పి డాక్టరు వేగంగా పరిగెత్తారు.

వాళ్లు ఎత్తైన కొండ అంచుకు వచ్చారు, చాలా కిందన నది ఉంది. కోతుల రాజ్యం నదికి అవతలివైపు ఉంది.

కుక్క జిప్ కిందకి చూసి పడిపోయినంత పని చేసింది. “ఈ నదిని దాటటం ఎలా?” అది అడిగింది.




అప్పుడు అందరికంటే పెద్దదైన కోతుల నాయకుడు మిగిలిన కోతులకు ఆదేశాలు ఇచ్చింది, “వంతెన కడదాం పదండి! తొందరగా! చిటికెలో అది పూర్తి కావాలి!”
ఒకదాని కాళ్లు, చేతులు, తోకలు మరొకటి పట్టుకుని చిటికెలో వంతెనను పూర్తి చేశాయి.

అది కోతుల వంతెన.
“పదండి! వంతెన దాటండి! కోతుల వంతెన మీదనుంచి అవతలివైపుకి చేరుకోండి!” కోతుల నాయకుడు తొందరపెట్టింది.



నొప్పి డాక్టరు, అతడితో ఉన్న జంతువులు ముందు చాలా భయపడ్డారు. ఆ వంతెన చాలా సన్నగా ఉంది! ఆ వంతెన నది కంటే చాలా ఎత్తులో ఉంది. అయితే చివరికి ఒక్కొక్కరు ఆ వంతెన మీదనుంచి అవతలివైపుకి క్షేమంగా దాటారు. అందరికంటే చివర నొప్పి డాక్టరు దాటాడు. వాళ్లు నదికి అవతలివైపుకి చేరుకున్నారో లేదో...

...సైనికులు అక్కడికి చేరుకున్నారు. వాళ్లు కోపంతో తమ చేతులలోని కత్తులు వాళ్ల మీదకి విసిరారు. శూలాలు విసిరారు. గట్టిగా అరిచారు. అయితే ఆపాటికే చాలా ఆలస్యమయ్యింది. నొప్పి డాక్టరు, అతడి జంతువులు కోతుల రాజ్యానికి క్షేమంగా చేరుకున్నారు.




అక్కడ నొప్పి డాక్టరుకి జబ్బుపడ్డ కోతులు వందలు, వేల సంఖ్యలో కనిపించాయి. టీకాలు వేయించుకోటానికి కోతులను అన్నింటిని అతడు రమ్మన్నాడు. రాత్రిళ్లు కూడా ఆపకుండా మూడు రోజులపాటు కోతులు వస్తూనే ఉన్నాయి. అడవుల నుంచి, లోయల నుంచి, కొండల నుంచి, గుట్టల నుంచి కోతులు వస్తూనే ఉన్నాయి.

పూరి గుడిసెలో కూర్చుని ఉన్న నొప్పి డాక్టరు దగ్గరకి కోతులు వస్తూ ఉన్నాయి. అతడు పగలు, రాత్రి అలాగే కూర్చునుండి టీకాలు వేస్తూనే ఉన్నాడు, వేస్తూనే ఉన్నాడు. కొద్ది రోజులకు కోతుల ఆరోగ్యం మెరుగుపడసాగింది.

ఆపాటికి నొప్పి డాక్టరు ఎంతో
అలసిపోయాడు. మంచం మీద
నిద్రపోయాడు. మూడు రోజులు,
మూడు రాత్రులపాటు అతడు పక్కకి
కూడా తిరగకుండా నిద్రపోయాడు –
అంతగా అలసిపోయాడన్నమాటు.





నిద్ర నుంచి మేల్కొన్న తరువాత ఇక
జబ్బుపడిన కోతులు ఏవీ లేవని నొప్పి డాక్టరు
తెలుసుకున్నాడు. కోతులన్నీ ఇప్పుడు
ఆరోగ్యంగా ఉన్నాయి! నొప్పి డాక్టరు వేసిన
టీకాలతో కోతులన్నీ ఆరోగ్యంగా ఉన్నాయి.
తమ ఊరు పోతారులంకకి తిరిగివెళతామని
నొప్పి డాక్టరు చెప్పాడు.

అది విన్న కోతులు ఆశ్చర్య పోయాయి. నొప్పి డాక్టరు ఇక ఎన్నటికీ తమతోనే ఉంటాడు అని అవి అనుకున్నాయి. ఆ రోజు రాత్రి కోతులన్నీ సమావేశమయ్యాయి. "నొప్పి డాక్టరు మనల్ని వదిలి వెళుతున్నాడంటే బాధగా ఉంది. అతడు వెళ్లటం తప్పనిసరి అయితే అతడికి బహుమతి ఇవ్వాలి," ఒక ముసలి కోతి చెప్పింది. "నొప్పి డాక్టరుని నిజంగా సంతోషపెట్టాలంటే అతడు ఇంతకు ముందెన్నడూ చూడని జంతువుని ఇవ్వాలి."

"ఇగువానా?"

"కాదు!"


"ఒకాపి?"

"కాదు!"

"లాగుడు-తోపుడు?"


"అవును!"

"మనుషులు ఎవరూ ఇప్పటి వరకు లాగుడు-తోపుడిని చూడలేదు. నొప్పి డాక్టరుకి దానిని ఇద్దాం."




ఇప్పుడు లాగుడు-తోపుడు
జంతువులు అంతరించిపోయాయి.
నొప్పి డాక్టరు ఆఫ్రికాలో ఉన్నప్పుడు
కొన్ని మిగిలి ఉన్నాయి.
లాగుడు-తోపుడికి తోక ఉండదు.
దానికి ముందు, వెనక కొమ్ములతో
తలే ఉంటుంది.

రెండు తలల లాగుడు-తోపుడిని
పట్టుకోవటం చాలా కష్టం. ఎందుకంటే ఒక
తల నిద్రపోతూ ఉంటే రెండవ తల కాపలా
కాస్తూ ఉంటుంది. అందుకే అవి ఎవరికీ
దొరకవు, అందుకే లాగుడు-తోపుడు ఏ
జంతుశాలలోనూ కనిపించదు.



నొప్పి డాక్టరుకి లాగుడు-తోపుడిని బహుమతిగా ఇవ్వటానికి కోతులు ఒక ప్రణాళిక వేశాయి. అవి చాలా నిశ్శబ్దంగా అడవిలో వేటకి బయలు దేరాయి.



లాగుడు-తోపుడు దొరకటానికి ఎక్కువ అవకాశాలు ఉన్న ఒక ప్రదేశాన్ని ఎంచుకున్నాయి.

తరవాత కోతులన్నీ గుండ్రంగా నిలబడి ఒకదాని చేతులు మరొకటి పట్టుకున్నాయి. అవి రావటం లాగుడు-తోపుడు విన్నది. అది బయటపడటానికి ప్రయత్నించింది కానీ దానికి చేతకాలేదు!

కోతుల నుంచి బయటపడలేనని లాగుడు-తోపుడికి అర్థమైపోయింది. మీకేం కావాలని అది కోతులను అడిగింది. నొప్పి డాక్టరుతో కలసి అతడి ఇంటికి వెళ్లాలని ఉందా అని దానిని కోతులు అడిగాయి.

“ఏమాత్రం లేదు!” అని లాగుడు-తోపుడు బదులు ఇచ్చింది.
దానిని ఒప్పించటానికి కోతులు మూడు పగళ్లు, మూడు రాత్రుళ్లు ప్రయత్నించాయి.
“సరే పదండి, మీతో వస్తాను. అయితే నొప్పి డాక్టరు ఎటువంటి మనిషో ముందుగా నేను చూడాలి,” అంది లాగుడు-తోపుడు.





నొప్పి డాక్టరుని లాగుడు-తోపుడు జాగ్రత్తగా పరిశీలించింది. అతడు చాలా మంచివాడని, చాలా అమాయకుడని దానికి అర్థమైపోయింది. అతనితో ఇలా అంది: “ఈ కోతులకు మీరు ఎంతో సహాయం చేశారు. మీతో పాటు వెళ్లాలని నేను నిర్ణయించుకున్నాను.”

తరవాత లాగుడు-తోపుడితో కలిసి నొప్పి డాక్టరు, అతడి జంతువులు సముద్ర తీరానికి బయలుదేరాయి. వాళ్లకి వీడ్కోలు చెప్పటానికి కోతులు కూడా వాళ్లతోపాటు వెళ్లాయి.

వందల, వేల సంఖ్యలో ఉన్న కోతులకు వీడ్కోలు చెప్పటానికి చాలానే సమయం పట్టింది. తనకు నయం చేసిన డాక్టరుతో చెయ్యి కలిపి అతడికి తమ కృతజ్ఞత తెలపాలని ప్రతి ఒక్క కోతికి ఉంది.




ఆ తరవాత లాగుడు-తోపుడు, గబ్-గబ్, డబ్-డబ్, జిప్, టూ-టూ, మాటల చిలక, చీ-చీలతో కలసి నొప్పి డాక్టరు ఓడ ఎక్కాడు.

వాళ్లు ఎక్కిన ఓడ కొంచెం సేపటికి తీరం నుంచి చాలా దూరం వెళ్లింది. ఇప్పుడు వాళ్ల చుట్టూ ఎటుచూసినా మహాసముద్రమే, వాళ్లు ఒంటరివాళ్లమన్న భావన కలగసాగింది. అంతే కాకుండా వాళ్లు దారి కూడా తప్పారు. వాళ్ల దగ్గర ఉన్న ఆహారం కూడా అయిపోసాగింది. గాలి వీచటం ఆగిపోవటంతో ఓడ సముద్రంలో అక్కడే నిలిచిపోయింది. “మనం తిరిగి ఇంటికి చేరుకోలేమని అనిపిస్తోంది,” అన్నాడు నొప్పి డాక్టరు. అంతలోనే వాళ్లకి ఒక వింతైన శబ్దం వినిపించింది. రాను, రాను ఆ శబ్దం పెద్దగా వినిపించసాగింది.



పక్షులు! వేల, లక్షల పక్షులు! వేల, లక్షల బాబిల పిట్టలు వేగంగా ఎగురుతూ వస్తున్నాయి. ఆ బాబిల పిట్టలు ఓడను చూశాయి.


ఆ పిట్టలు కిందకి దిగాయి. అవి నీటికి దగ్గరగా కొంచెం సేపు ఎగిరాయి. తరవాత అవి ఓడ తాళ్లను తమ కాళ్లతో పట్టుకుని, మళ్లీ పైకి ఎగిరాయి. అవి ఎగురుతూ ఓడని ముందుకి లాగసాగాయి.



దాంతో నొప్పి డాక్టరి ఓడ వేగంగా ప్రయాణించసాగింది. తన టోపీ ఎగిరిపోకుండా దానిని నొప్పి డాక్టరు పట్టుకోవలసి వచ్చింది. అలా బాబిల పిట్టలు ఓడను లాగుతూ కొంచెం సేపట్లోనే దానిని ఇంగ్లాండు తీరానికి చేర్చాయి.



ఇంగ్లాండు చేరుకునేసరికి అక్కడ శీతాకాలపు లేత సూరీడు ప్రకాశిస్తున్నాడు. సొంత ఊరికి తిరిగి రావటంతో నొప్పి డాక్టరు సంతోషంగా ఉన్నాడు.
రాత్రి భోజనాల తరవాత వెచ్చని నెగడు చుట్టూ చేరి నొప్పి డాక్టరు, జంతువులు వేడి కాగేవాళ్లు. ఆఫ్రికా గురించి నొప్పి డాక్టరు ఒక కొత్త, పెద్ద పుస్తకం రాస్తున్నాడు. దాంట్లోంచి నొప్పి డాక్టరు చదివి వినిపించేవాడు.



ఆఫ్రికా! దానిని ఎన్నటికీ మరిచిపోలేరు! అక్కడ కొబ్బరిచెట్లలో కోతులు కిచకిచలాడేవి. లాగుడు-తోపుడు దొరికిన అందమైన దేశమది!

